క్లుప్తంగా

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ



టెలిఫోన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ప్రశాంత్‌నగర్, టెలిఫోన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాతా శిశు సంరక్షణ సేవలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు వందన తదితరులున్నారు.

17న పూతలపట్టు నియోజకవర్గ సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని పూతలపట్టు నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సమీక్ష ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ శుక్రవారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ ఉత్తర్వుల మేరకు పూతలపట్టు నియోజకవర్గంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. ఈ సమీక్షకు అధికారులు సంబంధిత నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.ఉదయం 10 గంటలకు కాణిపాకంలోని కల్యాణమండపంలో సమీక్ష ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పానాటూరులో భారీగా స్తంభించిన ట్రాఫిక్



రోడ్డుపై ఆగిపోయిన వాహనాలు

గుడిపాల: మండలంలోని పానాటూరు వద్ద వాహనాలు భారీగా స్తంభించాయి. చిత్తూరు–వేలూరు రహదారిలోని మద్రాస్‌క్రాస్ రోడ్డు నుంచి పానాటూరు వరకు రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ఈ నేపథ్యంలో శుక్రవారం తమిళనాడులోని తిరువణ్ణామలైలో కార్తీకదీపం కార్యక్రమానికి వేల సంఖ్యలో భక్తులు వెళ్తున్నారు. గుంతలమయంగా రోడ్డు ఉండడంతో ఎక్కడ వాహనాలు అక్కడే ఇరుక్కుపోయాయి. దీంతో గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను తరలించారు.

అద్దె చెల్లించని దుకాణాలను సీజ్ చేయండి



దుకాణాలను పరిశీలిస్తున్న సహాయ కమిషనర్

చిత్తూరు అర్బన్: కార్పొరేషన్‌కు అద్దె చెల్లించకుండా ఉన్న దుకాణాలను సీజ్ చేయాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ ప్రసాద్ ఆదేశించారు. నగరంలోని ఏఎస్‌ఎం మునిసిపల్ వాణిజ్య సముదాయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పలువురు దుకాణ నిర్వాహకులు దీర్ఘకాలికంగా అద్దె చెల్లించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సహాయ కమిషనర్ వెంట రెవెన్యూ అధికారి గోపాలకృష్ణవర్మ, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

22న కృత్రిమ అవయవ పరికరాల శిబిరం

పలమనేరు: పట్టణంలోని ఈనెల 22న జెడ్పీ హైస్కూల్ వద్ద కృత్రిమ అవయవ పరికరాల పంపిణీ కోసం అవసరమైన వారిని గుర్తించేందుకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ ఏపీఎం హరినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. వాకర్లు, చేతికర్రలు, వీల్‌చైర్‌లు, బ్యాటరీ ట్రైసైకిళ్లు అందజేస్తామని తెలిపారు.

ఒక్కో పథకం రాష్ట్ర ప్రజల స్థితిగతులను మారుస్తుందన్నారు. కానీ ఒక్కరి తలరాత కూడా మారలేదు. తమను అధికారంలోకి తీసుకొస్తే అలాంటి పథకాలు ఏకంగా ఆరింటిని అమలు చేస్తామని అభయమిచ్చారు. తల్లికి వందనం అన్నారు.. ఆ తల్లి దండం పెట్టి అడుగుతున్నా కరగడంలేదు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎప్పుడో తెలియడంలేదు. ప్రతీ రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందించి పంటసాగుకు పెట్టుబడి అన్నమాట నీటిమూటగా మారుతోంది. నిరుద్యోగ భృతి కింద ఒక్కో నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు ఇస్తామని, 20 లక్షల ఉపాధి అవకాశాలు సృష్టిస్తామన్నారు. ఒక్క ఉద్యోగం వస్తే ఒట్టు. ఇక ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు వాగ్దానం అమల్లోకి తెచ్చాం అంటున్నా.. క్షేత్రస్థాయిలో చూస్తే లబ్ధిదారులకు రీయింబర్స్‌మెంట్ సరిగా కావడంలేదు. ఇక ప్రతీ మహిళకు నెలకు రూ.1500 అని చెప్పిన హామీ అమలు ఎప్పుడో ఆరు నెలలైనా ఇంకా తేల్చలేదు.

చిత్తూరు ఎంపీ ఇచ్చిన వరాల జల్లుల ప్రకటన





అర్ధ సంవత్సరం.. అధ్వానం!

- ఆరు నెలల్లో ఏమీ చేయని కూటమి సర్కారు
- జిల్లా కేంద్రంలో ఒక్క హామీ నెరవేర్చని వైనం
- కనిపించకుండా పోయిన ఎంపీ.. ఎమ్మెల్యేల సొంత మేనిఫెస్టో
- అమలుకు నోచుకోని 'సూపర్ సిక్స్' కూటమి హామీలకు సమాధి

హామీల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు		
నిరుద్యోగులు	-	47,600
మహిళకు నెలకు రూ.1500 అర్హులు	-	93,690
రైతు పెట్టుబడి సాయం లబ్ధిదారులు	-	16,712
తల్లికి వందనం లబ్ధిదారులు	-	26,408
ఉచిత బస్సుకు అర్హులైన మహిళలు	-	1,24,921
వంట గ్యాస్ వినియోగదారులు	-	56,935

చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గంలో 2.02 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా గురజాల జగన్‌మోహన్ నాయుడు ఎమ్మెల్యేగా, దగ్గుమళ్ల ప్రసాదరావు ఎంపీగా గెలుపొందారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్‌తో పాటు ఎన్నికల మేనిఫెస్టోలోని వాగ్దానాలను ఒక్కటి కూడా ఇంకా నెరవేర్చలేదు. ఇవి కాకుండా చిత్తూరులో తమను గెలిపిస్తే చేస్తామో అంటూ.. జగన్‌మోహన్ నాయుడు, ప్రసాదరావు సొంత మేనిఫెస్టో రూపొందించారు. దీన్ని చూసిన ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించారు. జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ, ఐఐటీ, నవోదయ కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేస్తామన్నారు. వీటిల్లో నవోదయ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మదనపల్లెకు వెళ్లిపోయింది. గుడిపాలలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గార్మెంట్, షూ కంపెనీ పెడతామని హామీ ఇచ్చారు. చిత్తూరు ఎంపీ తన వంతు వాగ్దానాలుగా యూనివర్సిటీ ఏర్పాటు, మామిడికి మద్దతు ధర ఇవ్వడానికి మ్యాంగో బోర్డు, ఏనుగుల దాడుల నివారణకు బంగారుపాళ్యం నుంచి కుప్పం వరకు సోలార్ ఫెన్సింగ్, అంతర్జాతీయ కంపెనీల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, అడవిపల్లె రిజర్వాయర్ నుంచి తెలుగు గంగ నీరు,,

చిత్తూరులో ఆటోమొబైల్ పార్కు, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు, క్రీడల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్సు నిర్మాణం, కాట్పాడి – తిరుపతి మధ్య డబుల్ లైన్ మంజూరు, నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీ, నిరుద్యోగులకు స్టడీ సర్కిల్ ఏర్పాటు, ప్రతి నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల ఏర్పాటు, సీఎంసీ ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం హెల్ప్‌లైన్, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రామా సెంటర్ ఏర్పాటు, మహిళలకు ఉద్యోగ అవకాశాలు, ప్రతీ నియోజకవర్గంలో వెనుకబడ్డ వర్గాలకు కమ్యూనిటీ హాలు నిర్మించుకోవడానికి సహకారం అందిస్తామని హామీల వర్షం కురిపించారు. వీటిలో ఏవి ఎప్పటి నుంచి అమలవుతాయని ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

సీఎం స్థాయి హామీల అమలు ఎక్కడ?

ఈ ఏడాది మే 11వ తేదీన చిత్తూరు నగరం మురకంబట్టు కూడలిలో నిర్వహించి ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు సైతం చిత్తూరు ప్రజలకు హామీల వర్షం కురిపించారు. తమను అధికారంలోకి తీసుకొస్తే చిత్తూరులో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేసి, ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తామన్నారు. చిత్తూరులోనే ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామన్నారు. చిత్తూరుకు పరిశ్రమలు తీసుకొస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు నీళ్లిచ్చి, చిత్తూరు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. కానీ వీటిలో ఒక్క హామీను కూడా నెరవేర్చడానికి బీజం పడలేదు. గతేడాది ఫిబ్రవరి 6, 7వ తేదీల్లో చిత్తూరు నియోజకవర్గంలో యువగళం పేరిట పర్యటించిన నారా లోకేష్ ఇక్కడి ప్రజలకు పెద్ద హామీలనే ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎస్సీలకు మాదిగ, మాల, రెల్లి కార్పొరేషన్లు పెట్టి, వాటికి చైర్మన్లను నియమించి ఏం సాధించారని ప్రశ్నించిన లోకేష్.. తాము అధికారంలోకి వస్తే ఎస్సీలకు వెన్నెముక అవుతామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఎస్సీ సబ్‌ప్లాన్‌ను కొనసాగిస్తామని, ఎస్సీలకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. ఇక చిత్తూరులో యూనివర్సిటీ ఏర్పాటు, ఎలక్ట్రానిక్ మానుఫాక్చరింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్నారు. చిత్తూరు ప్రజల దాహార్తిని తీర్చడానికి శాశ్వత తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సబ్‌ప్లాన్ కాదు కదా.. ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు నోటిఫికేషన్ ఇస్తే ఒట్టు. ఇక యూనివర్సిటీ, ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి పరిశ్రమ స్థాపనకు గజం స్థలం చూపిస్తే ఒట్టు.



చిత్తూరు ఎమ్మెల్యే సొంత మేనిఫెస్టో



పంటసాయం లేదు

చిన్న, సన్నకారు రైతులకు ఏడాదిలో పంట సాయం ఇస్తామని ప్రభుత్వం చెప్పినాది. ఖరీఫ్ వెళ్లిపోయినాది. రూపాయి సాయం ఇవ్వలేదు. రబీ అయిపోతా ఉన్నా పంట సాయం ఇవ్వలేదు. ఎప్పుడిస్తారో తెలియదు. అసలు రైతులు వ్యవసాయం చేయాలా..? వద్దా..? అనే ఆలోచనలో పడిపోతున్నారు.

–కె.దామోదరం, తుమ్మింద పాళ్యం, చిత్తూరు మండలం



గెలిస్తే నెల నెలా డబ్బన్నారు..

టీడీపీకి ఓట్లు వేసి గెలిపిస్తే నెలకు ప్రతీ మహిళకు రూ.1500 ఇస్తామన్నారు. ఇప్పటికే ఆర్నెళ్లు అయిపోయింది. అంటే రూ.9 వేలు పోయినట్టే కదా. అసలు ఎప్పటి నుంచి మహిళలకు డబ్బులిస్తారో చెబితే, అప్పటి వరకు అడగరు కదా. మీరు ఇస్తామని చెప్పడంతోనే అడుగుతున్నాం.

–ఆర్. నదియ, చిత్తపార, గుడిపాల మండలం



పిల్లల స్కూల్ ఫీజుకు ఇబ్బంది..

మాకు ఇద్దరు పిల్లలున్నారు. గతంలో నాలుగేళ్లపాటు అమ్మ ఒడి ఇవ్వడంతో ఫీజు కట్టేపనిలేకుండా పోయింది. ఇపుడు తల్లికి వందనం ఇస్తామన్నారు. ఫీజు కోసం స్కూల్‌లో రోజూ ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇచ్చి, తాము పథకం అమలు చేసేంత వరకు ఇబ్బంది పెట్టొద్దని స్కూళ్లకు చెప్పాలి.

–నందిని, చిత్తూరు

సమస్యలను పరిష్కరించుకోవాలి



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్

బంగారుపాళెం: గ్రామ రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని గుండ్లకట్టమంచి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సదస్సును అధికారులు నిర్వహించారు. రైతులు వివిధ సమస్యలపై విన్నపాలు అందించారు. భూ సమస్యలకు సంబంధించి 7 అర్జీలు వచ్చాయన్నారు. ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు మహేంద్ర, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, ఆర్ఐ మధుసూదన్, మండల సర్వేయర్ లావణ్య, వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల కట్టడికి సమష్టిగా పనిచేద్దాం

చిత్తూర రూరల్(కాణిపాకం): బాల్య వివాహాల కట్టడికి సమష్టిగా పనిచేద్దామని ఎంపీడీఓ శ్రీనివాసరావు, సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి, ఎంఈవో సెల్వరాజ్ అన్నారు. చిత్తూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆర్థిక సమస్యలు, బాధ్యత పేరుతో బాలికలను మూడు ముళ్ల బంధంలోకి నెట్టేస్తున్నారని చెప్పారు. దీని వల్ల భవిష్యత్‌లో అనేక రకాల సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోందనే విషయాన్ని క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు జరిగితే వెంటనే అడ్డుకునే ప్రయత్నం చేయాలన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకునేలా చేద్దామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని దివిటివారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తారన్నారు. రోజూ ఆహారంలో చిరుధాన్యాలను తప్పక తీసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లీ బిడ్డకు శ్రేయస్కరమని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని సీపీఐ, ఏఐకేఎస్ రైతు సంఘం డిమాండ్ చేసింది. నగరంలోని పాంచాలిపురంలో దెబ్బతిన్న పంటను శుక్రవారం ఆ సంఘం నాయకులు పరిశీలించారు. నాయకులు నాగరాజు, మునిరత్నంనాయుడు మాట్లాడుతూ కురిసిన వర్షానికి పలు రకాల పంటలు నేలమట్టమైనట్లు చెప్పారు. రైతులు అప్పులు చేసి పంట పండిస్తే..చివరకు తుపాను వచ్చి పంటను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్‌కుమార్‌రెడ్డి, దాసరి చంద్ర, రఘు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల సేవల్లో నిర్లక్ష్యం వద్దు



తనిఖీలో అధికారులు

పూతలపట్టు (కాణిపాకం): గర్భిణుల సేవల్లో నిర్లక్ష్యం వద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏస్‌ఓ జార్జ్, ఆబీఎస్‌కే కో–ఆర్డినేటర్ శిరీష పేర్కొన్నారు. పూతలపట్టు మండలం బండపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శుక్రవారం వారు తనిఖీ చేశారు. పలు రిజిస్టర్లు, గర్భవతుల వైద్య సేవల నిర్వహణపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు బాధ్యతతో విధులు నిర్వహించాలని చెప్పారు. గర్భిణుల విషయంలో అలసత్వం వద్దన్నారు. గర్భవతుల నమోదు నుంచి ప్రసవం వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు ప్రియాంక, ప్రవీణ, సీపీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు సిద్ధేశ్వరాలయంలో దీపోత్సవం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు సమీపంలో ఉన్న సిద్ధేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని కార్యనిర్వాహకులు సిద్ధారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం సిద్ధేశ్వర స్వామికి అభిషేకం, పూజలు చేస్తామన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శివకోటి భజన కీర్తనలు ఆలపించనున్నట్లు వివరించారు. మధ్యాహ్నం కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కిశోర బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



తవణంపల్లెలో మాట్లాడుతున్న ఐరాల సీడీపీఓ నిర్మల

తవణంపల్లె: కిశోర బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఐరాల సీడీపీఓ నిర్మల ఆకాంక్షించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ×కిశోర వికాసం– బాలికల సాధికారతకు పునాది¤ అనే కార్యక్రమంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల భాగస్వామ్యంతో కిశోర వికాసం– బాలికల సాధికారత కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. మానవ అక్రమ రవాణాపై, పిల్లల మాదకద్రవ్యాలు వినియోగం అరికట్టడానికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని అన్నారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, మానవ విలువలు, యోగా, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ ఉపయోగాలను వివరించారు. పోక్సో చట్టం, బాలల చట్టాలపై గ్రామ స్థాయి నుంచి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ సచివాలయ పరిధిలో బడి బయట ఉన్న 11 నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన కిశోర బాలికలను గుర్తించి వారిని గ్రూపులుగా విభజించి ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలలో రెండు మార్లు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మహిళా పోలీసుల బాధ్యత తీసుకొని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణాధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడుతామని స్పష్టం చేశారు. బాలికల సాధికారతకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

దేవరకొండపై ఘనంగా కార్తీక దీపోత్సవం





దేవరకొండపై విశేషాలంకారంలో శ్రీపార్వతీ సమేత జలకంఠేశ్వరస్వామి, ఆలయం ఎదుట కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయానికి అనుబంధంగా ఉండే దేవరకొండపై శుక్రవారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవరకొండపై వెలసిన పార్వతీ సమేత శ్రీ జలకంఠేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం అర్చకులు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛరణల మధ్య దేవరకొండ బురుజుపై కార్తీకదీపాన్ని వెలిగించారు. కార్తీక దీపోత్సవానికి పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిచారు. మొగిలి శివాలయంలో శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు శివాలయం ముందు కార్తీక దీపారాధన చేశారు. ఆలయం ఆవరణలోని ఉసిరి చెట్టుకు ప్రదక్షిణలు చేపట్టారు. దేవరకొండపై జలకంఠేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు హోసూర్‌కు చెందిన షణ్ముగం కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజ, ఆలయ పర్యవేక్షకులు కుమార్ పాల్గొన్నారు.





బంగారుపాళెం:మొగిలి దేవరకొండ బురుజుపై కార్తీక దీపం, బురుజు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు